అనుభవమైతేగాని అన్నీ తెలియవు

ఎన్. శేషాచలరావుగారు బి. ఏ.

౧

గణపతిరావుకు యిప్పుడే ఉత్తరమొచ్చింది. సావిడిలో కూర్చుని చదువుతున్నాడు. ఇంతట్లో అతనిభార్య కమల వచ్చిందక్కడకు. "ఎక్కడనుంచి ఉత్తరం?"మన్నది ఆవిడ. "మాఅక్కయ్య వస్తుందట సాయంత్రం బండికి"అని అన్నాడు సంతోషంతో గణపతిరావు.

కమల:—వస్తుంది! ఎక్కడకు? (అన్నది కనుబొమలు ముడుస్తూ)

గణ:—ఎక్కడికేమిటి? ఇక్కడకే.

కమల:—ఇక్కడికికాక యింకెక్కడికి వస్తుంది-నడిఏటోకి. ఇక్కడికనే నాకూ తెల్సు.

గణ:—చాలాకాలమైంది వచ్చి.

"పోనీ ఎల్లకాలం కూర్చోమనండి. ఎవరొద్దన్నారు? ఎవరుచేస్తారో వీళ్లందరకు చాకిరీలు? తేరగావుండేదాన్ని నేనొకతనే దొరికాను గాబోలు. వాళ్ల చెల్లెలుగారు యిచ్చటకువచ్చి మొన్నటివరకు తీవివేసారు. ఇంక యీవిడొస్తుంది. ఈ యిల్లు వాళ్లందరకు నాళంవారిసత్రవయిపోయింది........ ఇదిగో! మీకేచెప్పడం ఈవిడ్ని తెచ్చి కొంపమీద పెడుతున్నారు. చాకిరీచెయ్యడానికి నాకేమివోపిక లేదు. ఒక్కపూటకన్న ఎక్కువుంటే నాపుట్టింటికి నేను వెళ్లిపోతాను. ఆతరువాతసంగతి మీరు చూసుకొండి."అని తుర్రుమంది లోపలకు గణపతిరావు భార్య.

గణపతిరావు నిర్ఘాంతపడిపోయాడు. అయినా అతనికి క్రొత్తగాదు భార్యయొక్క అదలింపులు. మొన్న చెల్లెలిని శ్రావణమాసానికి తీసుకొని వచ్చినందుకు అతడు ముప్పతిప్పలుపడి మూడుచెరువులనీరు త్రాగాడు. ఆ అదురు యింకా అతనికి వదలలేదు. ఇప్పుడు రాకరాకవచ్చే అక్కగారిని రావద్దంటాడా! పెండ్లాముచే మాటలుపడ్తాడా? అన్నిటికి సిద్ధపడాలె అమ్మగారిని చేసుకున్నతరువాత. కనుక తెగింపు తప్పదు గణపతిరావుకు. అక్కను తీసుకొనిరావడం, యిల్లాలిచే తలవాయ చీవాట్లుతినడం అతనికి వ్రాసి పెట్టాడు బ్రహ్మదేవుడు.

అదేమిటో ప్రపంచధర్మం. ఎలుకనుచూస్తే పిల్లికి గిట్టదు. పిల్లినిచూస్తే ఎలుకకు గిట్టదు. అత్తనుచూస్తే కోడలుకు గిట్టదు. కోడల్నిచూస్తే అత్తకు గిట్టదు. అంతకన్నా గిట్టనిది ఆడబడుచులకు, వదినెలకు. పాక్కనివైరము, సాగెడువైరము, లోపల లోపలే రగలెడువైరము వాళ్లలో ప్రబలుతుంది. టప్పటుప్పలతో ఎగిరే ఐరోపాయుద్ధాలుకావలి. లోపలలోపలే కుమలికొంపలు కూల్చేవవి. కారణములేని కలహాలు, మనస్సులను కలతపెట్టేవైరాలు. చేసేవారికన్న చూసేవారికెక్కువ ఆయాసం కల్గేవవి. కమలానికి గణపతిరావక్కపై వైరమెట్లు పుట్టిందో, ఎందుకుపుట్టిందో, ఎప్పుడుపుట్టిందో ఎవ్వరికి తెలియదు. కమలానికికూడ తెలియదనుకుంటాను. కాని ఆవిడకు గణపతిరావక్కపై క్రోధమున్నమాటమట్టుకు నిజం. తనభర్తకు ఆవిడ అక్కైపుట్టడం ఆవిడకర్మం. దానికి కమలం ఏంచేస్తుంది? ఒక్కటిమట్టుకు కమలం నిశ్చయించుకుంది. గణపతిరావక్కవస్తే ఆవిడ మొగమన్నా చూడకూడదని. అందువల్ల ఎవరికినష్టం? వచ్చేఆవిడ ఏరెండుమూడురోజులోవుండి పోతుంది కాని ఎల్లకాలం అనుభవించేది అవిడతమ్ముడు గణపతిరావు. కొర్విచ్చులమధ్యపడ్డ మిడుతలాగ తను తపించేపంతుంది. అందుకెవ్వరేమి చెయ్యగలరు?

౨

సాయంత్రం అయిదున్నరబండివచ్చేవేళ. గణపతిరావు ఆఫీసునుండే స్టేషనుకు వెళ్లానన్నాడు— రాకరాకవచ్చేఅక్కను అహ్వానించడానికి. ఎవరికి

కుతూహలముగాదు తోబుట్టువును చూడ్డానికి—అందులో తల్లంతమనిషి ఆవిడ. నాలుగుగంటలకే అతను స్టేషనుకు వెళ్ళేప్రయత్నంలో వున్నాడు.

ఒకరికి యింపైంది యింకొకరికి కంపవుతుంది. గణపతిరావుకు తనఅక్కంటే అభిలాషగాని కమలానికేముంది? "పపీ! పపీ! సీదమూన్" అని చంద్రబింబాన్ని కుక్కపిల్లకు చూపెడ్తే "లొళ్లో లొళ్లో" అని మొరిగిందట. అక్కవస్తుందని గణపతిరావు సంబరపడితే, అతనిఆవిడ ఆడబిడ్డకు చాకిరీచెయ్యాలని అయిష్టపడింది రాఘువమ్మమీద-గణపతిరావు అక్కపేరు రాఘువమ్మ; చెప్పడం మర్చిపోయాను.- పుట్టిన అయిష్టం వట్టినేపోతుందా? కలపెట్టుంది మనస్సును వాంతి కడుపును కలపెట్టినట్టు. కోపము, తామసము, ఉక్రోషము, విచారము యివన్ని అరటిపిలకలక్రింద అంకురించాయి కమలంగారి హృదయంలో. మొహం ధుమధుమ లాడటం, ముక్కువిరుచుకోవడం, మూతివిరుచుకోవడం, యివన్ని ఆవిడయందు ప్రత్యక్షంగా కనుపించాయి. ఇవన్ని ఉత్తరంవచ్చినప్పటినుంచి రగుల్తున్నాయి; కాని నేడు మరీ ఎక్కువయాయి. నాలుగుటంగని కొట్టేటప్పటికి కమలం కమలంగాలేదు. "ఆవిడ ఎందుకురావాలె యిక్కడకు"అని కమలానికి గట్టిగాపట్టుకుంది. తనకు అబ్బవంక చుట్టముకాదు, అమ్మవంక చుట్టంకాదావిడ. ఎందుకుతాను చాకరీచెయ్యాలావిడకు? "ఏమి అగత్యంపట్టిందినాకు చాకరీచెయ్యడానికి"అని స్థిరమైనప్రశ్న వేసుకుంది కమల. అవును తానెవరు? ఆవిడెవరు? "ఎవరికివారే ఎమునాతీరే" అన్నారుపెద్దలు. 'సరే' అనుకుంది కమల. కోపమొచ్చినప్పుడు, తాపమొచ్చినప్పుడు ఆడవాండ్ర కొకేసూత్రం తెలును; తలకు తట్టెడుశొంఠిగంధం పట్టించుకుని మూల్గుతూ పండుకోవడం. ఆసూత్రమే 'అవలంబించింది కమలం కూడాను.

ఇక్కడీయన అక్కను బండిలోఎక్కించి యోగక్షేమాలడుగుతూ బండివెంట వస్తున్నాడు. కాని అతనికి కడుపులో ఆందోళన లేకపోలేదు. భార్య ఏపేచీపెట్టి తనపరువును బయటపెట్టుందోఅని. సరే యింటికొచ్చారు గణపతిరావు,అతనిఅక్క. మరదలుగారు ఎదురొచ్చి తన్ను లోనికితీసుకొనివెళ్ళే యోగం రాఘువమ్మగారికిలేదు. ఇంటిలోప్రవేశించి మరదలేదని ఆవిడ ప్రశ్నిస్తే ప్రక్కనున్న దాసీది "అమ్మగారు జ్వరమొచ్చి పైనపండుకున్నా"రన్నది. "ఆ! ఆ!" అన్నది అడలిపోతూ రాఘువమ్మగారు. (ఆవి డొకపిచ్చిమొత్తుకోళ్లు) "గణపతీ! ఏమిరా యింతవరకూ చెప్పలేదు అమ్మాయి జబ్బుగావుందని?" అని ఆవిడతమ్ముణ్ని మందలించింది. దొంగజబ్బులనేమని చెబుతారు? ముంగిలాగ వూరుకున్నాడు గణపతిరావు "ఆహా! యీఎత్తు ఎత్తిందా"అని లోన అనుకుంటూ.

ఆతురతో రాఘువమ్మగారు మేడఎక్కారు. ఆవిడకేమితెల్సు దొంగజబ్బు లక్షణాలు; సత్యకాలపు మనిషి. నిజంగా కమలానికి జబ్బేఅనుకుంది. ఆవిడరాక కనిపెట్టి మరదలుయిటున్న తల అటు త్రిప్పుకుంది. "అమ్మాయి! అమ్మాయి!" అని కమలాన్ని ఆవిడ పలుకరించింది. మాటాలేదు, చూపూలేదు. మొహాన్ని తట్టెడుశొంఠిగంధము మాత్రముంది. "ఏమే! యివాలేమన్నాకొంచం ఆహారమేమన్నా తీసుకుందా?"అని ఆవిడ దాసీదాన్ని ప్రశ్నించింది. "ఏమీ తీసుకోలేదని" దాసీది వ్రేళ్లుమెటికవిరస్తూ జవాబిచ్చింది. కంగారెత్తింది రాఘువమ్మకు. "ఈపూట మందిచ్చారా?" అన్నదిరాఘువమ్మ., "మందూలేదూ, మాకూ లేదు" అని దాసీది దీర్ఘంతీస్తూ చెప్పింది. "జబ్బుపడ్డ ఆడదానికి కాస్తమందన్నా తెచ్చుకోరా"!అని తమ్ముణ్ని కోప్పడింది రాఘువమ్మ. తమ్ముడేమని చెప్పుతాడు; "అక్కా! యిది దొంగజబ్బక్కా!"అని చెప్పితే తనపరువుకేనష్టం. కమలంమీద చెయ్యివేసింది రాఘువమ్మ. కమలానికి అరికాలుమంట నెత్తికెక్కింది. వొళ్లు నిప్పులుక్రక్కి నట్లయింది. "అబ్బా! ఎంతవేడుంది" అని కంగారుపడింది రాఘువమ్మగారు గణపతిరావు వైపుతిరిగి "ఏమిరా గణపతి! వెళ్లి డాక్టరును తీసుకునిరారా!" అని దీనంగా అన్నది.

అనుమానం పెట్టేనే అన్నిఅనుమానాలుపుట్టవి. అక్క అంత కంగారుపడి చెప్పేటప్పటికి తమ్ముడాందోళనలో పడ్డాడు. మానవజీవానికి రోగమెంతలో రావాలె? కంగారుపడి గణపతిరావు గబగబ పరుగెత్తాడు ప్రక్కవీధిలో బల్లకట్టుకున్న డాక్టరుకోసరం. ఇక్కడ రాఘవమ్మగారు విచారంతో మరదల్నె కనుపెట్టుకుని కూర్చుంది. "పిశాచం! యింకాపోదే"మని మరదలు లోలోపల విసుక్కుంటూంది.

3

ఇంతలో డాక్టరును వెంటబెట్టుకుని గణపతిరావు ప్రవేశించాడు. కమలానికి డాక్టరురావడం విభ్రాంతయిపోయింది. తనమగడు యిదంతా దొంగటక్కరని గ్రహించి పట్టినేవెళ్లి పట్టినే వస్తాడనుకుంది గాని యిలాకంగారుపడి డాక్టరును తెస్తాడనుకోలేదు. డాక్టరురావడం కనిపెట్టి కమల పారిపోవాలనుకుంది. కాని రాఘవమ్మ దెయ్యంలాగ ఆవిడ్ని పట్టుకుని "నీకేమి భయములేదమ్మా!"అని లేవనిచ్చింది కాదు. "నాది దొంగజబ్బు. ఆడబిడ్డవస్తుందని యిట్లా పండుకున్నాను. నన్ను వదలెయ్యండి"అని యిప్పుడు కమల ఏమని చెపుతుంది? 'రోటిలోతలపెట్టి రోకలిపోటుకువెరుచుటా?' అయినా జబ్బేమిలేనప్పుడు డాక్టరేమని చెబుతాడుఅని అనుకుంది కమల. డాక్టరుగారు ధర్మామీటరు నోటికితగిలించారు, నాడిచూసారు, రోగిని పరిశీలించి "మలేరియాజ్వరము, ఒకక్వినైన్ ఇంజక్షనుతో తగ్గిపోతుంది" అన్నారు. ధర్మామీటరుచూడగా జ్వరము కనుపించదు. "ఇపుడు పైకి ఉష్ణములేదు. అయినాఒకఇంజక్షన్ ఇచ్చుటమంచిది" అన్నాడాయన. దొరికినజీవిని పాముకాటెయ్యక మానదు, కనుపించినరోగికి డాక్టరు సూదిమందెయ్యక మానడు. మనడాక్టరుగారు కమలకు మలేరియాయిన్‌జెక్‌షన్ యివ్వ ప్రయత్నము చేస్తున్నారు. కమలకేమి ప్రాలుబోవుట లేదు. "ఏమో నిజంగా రోగముందేమో" అనుకుంది కమల:అవును. ఆడబిడ్డపై మండిపాటుకూడా ఒకరోగమే. కాని డాక్టర్లకు సర్జనులకు లొంగేదాఅది? "మాన్పుటకంటె ఆటంకపరచుట మేలని" ఎనిమిదిగ్రెయినుల క్వినైన్ డాక్టరుగారు సూదిలోకెక్కించి సిద్ధపరిచారు. ముందేమాహాత్మ్యమున్నా సూదిమందన్నా చక్రాంకితాలన్నా అందరికిభయమే. "ఎంత కష్టమొచ్చిందమ్మాయి!" అని అనుకుంటూ రాఘవమ్మగారు మొగ మావలకు త్రిప్పుకున్నారు. నాకు శాలఎద్దుపడున్నలాగ పడుంది కమల పెడమొగము పెట్టుకుని. "వూ. పర్వాలేదులే. అంతాక్షణ"మని గణపతిరావు పైకి గాంభీర్యంగా అన్నా లోనసూది 'కఊక్'అని కమలందండను ప్రవేశిస్తుందని తడబడక పోలేదు. కాని డాక్టరుగారు నదురూ బెదురూలేక బుట్టకు దబ్బలంగ్రుచ్చినట్లు కమలందండకు సూదినెక్కించారు. "ఆ!—ఆ'— అమ్మా! అని కమలం గ్రుడ్లంబడి వొక్కసారి నీళ్లు తెచ్చుకుంది. అంతాక్షణం. కాని కమలకు తాతముత్తాతలు జ్ఞాపకమొచ్చారు ఆక్షణంలో. "సరి. బిల్లురేపు పంపుతాలెండి"అని డాక్టరుగారు సెలవుపుచ్చుకున్నారు.

౪

ఎవరుతీసుకున్న గోతులో వారేపడ్తారు అనుసామెతెక్కడకుపోతుంది? డాక్టరుగారిచ్చిన యింజెక్‌షన్ కమలకు వొంటికెక్కింది. అరగంటకు తలనొప్పి అంకురించింది. మరొకఅరగంటకు అపరిమితమైన జ్వరంకాయడం మొదలుపెట్టింది. ఇంజెక్‌షన్ యిచ్చినచోట బొప్పికట్టి చెయ్యి స్వాధీనంలోలేకుండాపోయింది. రోగమొచ్చినట్లు నటించినందుకు రోగమిప్పుడు నిజంగానే తగుల్కొంది. పట్టినే శొంఠిపట్లు వేసుకున్నఫలితం వృధాగాపోతుందా? అపసోపాలు పడుతూవుంది కమల. ఆవిడమనస్సు పరిపరివిధాల పోతూవుంది. తనవారెవరు దగ్గరలోలేరు. క్రమేణజ్వరం హెచ్చడమేకాని తగ్గటంలేదు. పైవుపశాంతులు గణపతిరావు, అతనిఅక్క ఎంతచేస్తేనేమి? అసలు రోగము ఆడబిడ్డపై మండిపాటు. డాక్టరిచ్చింది మలేరియాజ్వరానికింజెక్‌షను. చెవు

రాఘు:—ఎంతయింది?

కమల:—రెండుసార్లు వచ్చినందుకు పదిరూపాలు, యిన్ జెక్షనుకు అయిదురూపాయలు—మొత్తం పదిహేనురూపాయిల ముడుపు.

రాఘు:—రోగాలను ఎక్కువచేసినా బిల్లుల పంపడంలో ఏమారరు డాక్టర్లు.

రాఘువమ్మ ప్రయాణం స్థిరపడింది. ఆమరునాటి "సాయింత్రానికే" కమలానికి పిచ్చియెత్తినట్లుగా వుంది రాఘువమ్మను వదలడానికి. బండిఎక్కుతూ రాఘువమ్మ "కమలం వెళ్లివస్తాను" అని చెప్పగా కమలం ఒక్కసారి కన్నీళ్లు తెచ్చుకుంది. వచ్చిన దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది.'

గణపతిరావు అక్కను రైలులోఎక్కించి యింటికివచ్చేసరికి కమలంమొహం ఎఱ్ఱబారి కందగడ్డలాగుంది. కన్నులు వాచిఉన్నాయి. "ఇదేమిటని?"గణపతిరావడిగితే, "వదెన బండిఎక్కిందా" అని కమలం దుఃఖాన్ని ఆపుకోలేక ఆపుకోలేకఅంది.

"ఆడవాళ్లకు కోపమెచ్చినా నిలువలేము ప్రేమ పుట్టినా నిలువలేము. ఇదెప్పటినుంచి యింతప్రేమ" అన్నాడు గణపతిరావు.

కమల:—వదెనకునాపై యింతప్రేమవుందని అనుకోలేదు. ఆవిడకు నేనేల చాకరీచెయ్యాలని మాతి బిగించుకుని పండుకున్నందుకు ప్రాయశ్చిత్తం బాగానే అయింది.

గణ:—ఏమయిందేమిటి?

కమ:—మీరు డాక్టరును పిలిపించి యింజెక్షన్ యిప్పించారు. అందువల్ల లేనిరోగం బయలుదేరింది. ఆచార్యులవారు తిండిపెట్టకమాడ్చారు. శ్రుతిమించి రాగంలో పడ్డట్టయింది. ఆవిడను చూసి నేను నన్నుచూసివిఆడ కౌగలించుకుని ఏడ్చాము. అదేమిటో ఆవిడ్ని చూస్తే మాఅక్కయ్యను చూసినట్లుగావుంది. ఆవిడమీద నాకు మొదట అసహ్యంఎందుకు పుట్టిందో తెలియకుండావుంది.

గణ:—ఇప్పటికన్నా తెలిసిందా?

కమల:—ఆహా! అనుభవమయితే గాని అన్నీ తెలియవు.

సంక్రాంతి: స్త్రీలు

శ్రీమతి దేశరాజు భారతీదేవిగారు

సీ. పూజకై వలసిన పువ్వులగొనిరాగ
ప్రొద్దునవెడలెడు పొలతియోర్తు,
ముంగిటిలోపల రంగవల్లులదీర్ప
గడగుచుండెడునట్టి కాంతయోర్తు,
గోమయంబునుదెచ్చి గొబ్బెళ్లుగాజేసి
వాకిటనుంచెడు వనితయోర్తు,
కమనీయకోమలకంఠంబు పైకెత్తి
యింపుగాపాడెడు యింతియోర్తు,

గీ. చెల్వమొప్పార సంక్రాంతి చేడెలెల్ల,
వీథివీథులగ్రుమ్మరి వేడ్కతోడ,
పేరటంబునకై గ్రామపణతిగముల,
పిలచుచుందురు కన్నుల నింపుగదుర.

సీ. మురిపెంబుగా మేన ముదుకచీరను తీవి
ధరియించినదియొక్క తలిరుబోణి
పువ్వులనద్దిన పొల్పుగురైకను
గుస్తరించిన దొక్కకోమలాంగి,
ముత్యాలుగూర్చిన మురిపెంపుహారమ్ము
గీలించినది యొక్కకీరవాణి
కస్తూరితిలకమ్ము కళకళలాడంగ
మోమునుంచిన దొక్కముద్దరాలు,

గీ. సకియలెల్లరుగూడుచు సంతసమున
నరుగుచున్నారు వింత నత్యంతభక్తి
ఓలలాడింప సంక్రాంతివేళలందు
గౌరిదేవినియత్యంత గౌరవమున.